క్లుప్తంగా

నగరి డీఎస్పీగా నరసింహమూర్తి



నగరి: నగరి డీఎస్పీగా నరసింహమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ రవికుమార్ వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. కర్నూలు నుంచి పదోన్నతిపై నరసింహమూర్తి ఇక్కడికి వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

రూరల్ సీఐగా సుబ్బరామిరెడ్డి



నిండ్ర: నగరి రూరల్ సీఐగా సుబ్బరామిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో నంద్యాల నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. స్థానిక సీఐ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో దేవతామూర్తులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామునే అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. తరువాత ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి పాలాభిషేకం చేశారు. విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఐకమత్యంతో సాధించుకోవాలి

పాలసముద్రం: ఐకమత్యంతో తమకు రావాల్సిన బెనిఫిట్స్‌ను సాధించుకోవాలని విశ్రాంత సైనికులు అన్నారు. మండలంలోని తిరుమలరాజుపురంలో విశ్రాంత సైనికులు ఎస్ అఫూస్‌రాజ్, వీ ధనకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం విశ్రాంత సైనికుల సమావేశం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో చిత్తూరు, మురకంబట్టు, గంగాధరనెల్లూరు డివిజన్ యూనియన్ అధ్యక్షులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆర్మీలో ప్రాణాలు పణంగా పెట్టి, సరిహద్దులో విధులు నిర్వహించామన్నారు. ఆర్మీ కుటుంబాలకు ప్రభుత్వం పరంగా అందాల్సిన సదుపాయాలను మనమంతా సమష్టిగా పోరాడి సాధించుకోవాలన్నారు. అందుకే యూనియన్ ఏర్పాటు చేశామన్నారు.

నయనానందకరంగా ఊంజల్ సేవ



ఉయ్యాల సేవలో సేదతీరుతున్న అమ్మవారు

నారాయణవనం: శ్రీపద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఊంజల్ సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుప్రభాత సేవతో తెరచి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం శ్రీపద్మావతీ అమ్మవారిని సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఉయ్యాల సేవ నయనానందకరంగా జరిగింది. భక్తులు కనులారా వీక్షించి తరించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆర్జితం అధికారి భరత్, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉపాధ్యాయుల హౌస్ విజిట్



తలారివెట్టులో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో మెరుగైన ఫలితాల కోసం హౌస్ విజిట్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు హెచ్‌ఎం రూపేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తలారివెట్టు, కల్లివెట్టు, ఎన్టీఆర్ నగర్ గ్రామాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు యువశ్రీమురళి, నాదెండ్ల మురళి రాత్రి పూట వెళ్లి, చదువుతున్నారా, లేదా, అని పర్యవేక్షించి, విద్యార్థుల సామర్థ్యాలను తల్లిదండ్రులకు తెలిపారు.

రూ.2లక్షల విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామికి చెన్నైకి చెందిన దాత తిలకవతి రూ.2లక్షలు విరాళంగా అందించారు. దాత కుటుంబ సభ్యులు శుక్రవారం స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష, నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళంగా అందించారు. వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

బాలిక 'ఉన్నత'ంగా చదవాలని..

- ఆడపిల్లల భవితకు ఊతం హైస్కూల్ ప్లస్
- మారిన తల్లిదండ్రుల ధోరణి



బలిజకండ్రిగ కళాశాలలో విద్యాబోధన చేస్తున్న అధ్యాపకుడు

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని.. అందుకు బాలికలకు ఉన్నత విద్య అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. సుదూరంలో కళాశాలకు వెళ్లలేని ఆడపిల్లల కోసం గ్రామాల్లోనే ఇంటర్మీడియట్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకోసం హైస్కూలు ప్లస్ విధానం అమలు చేసింది. ఫలితంగా తల్లిదండ్రుల ఆలోచనాధోరణి మారింది. ఫలితంగా బాలికలు కూడా ఉన్నతంగా చదవాలని ఆలోచిస్తున్నారు.

పాలసముద్రం: బాలికలకు సొంతూరిలోనే ఉన్నత విద్య అందించడానికి రాష్ట్రప్రభుత్వం హైస్కూలు ప్లస్ విధానాన్ని అమలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం 2022–23 విద్యాసంవత్సరం నుంచి ఈ విధానంలో బాలికలకు సొంతూళ్లోనే ఇంటర్మీడియట్ విద్యను అందిస్తోంది. ఇందులో భాగంగా బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ పాఠశాలలో ఇంటర్ విద్యకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించింది. దీంతో గతేడాది ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలు జరిగాయి. మొత్తం 38 మంది బాలికలకు సీట్లు కేటాయించారు. అధ్యాపకుల కొరత లేకుండా అన్ని పాఠ్యాంశాల బోధనకు అధ్యాపకులను సైతం ప్రభుత్వం నియమించింది. ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తోంది. దీనికితోడు హెచ్‌ఎం మనోహర్‌నాయుడు కృషితో దాతలు విద్యార్థులకు యూనిఫామ్ అందజేశారు. ప్రస్తుతం ఇక్కడ మొదటి సంవత్సరంలో 25 మంది, ద్వితీయ సంవత్సరంలో 13 మంది బాలికలు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు.

గతం దయనీయం

గత టీడీపీ పాలనలో బాలికల చదువు అత్యంత దయనీయంగా ఉండేది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండే కుటుంబాల్లో ఆడపిల్లలకు చదువెందుకన్న ధోరణి, తమ గ్రామానికి కళాశాలలు దూరంగా ఉండడం, ఇలా పలు కారణాలతో బాలికలను పదో తరగతితోనే మాన్పించేవారు. మరికొంత మంది తల్లిదండ్రులు పిల్లలను చదువు మానింపించి, టైలరింగ్, కూలి పనులకు పంపేవారు. దీంతో బాలికలు విద్యకు దూరమయ్యేవారు.

అందుబాటులో ఉన్నత విద్య

ప్రస్తుతం ఉన్న ఊరిలోనే బాలికలకు ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హైస్కూలు ప్లస్ విధానం అమలు చేయడంతో నేడు బాలికల చదువు కొనసాగుతోంది. సొంత ఊరిలోనే ఇంటర్మీడియట్ విద్య అందుబాటులోకి రావడంతో ఆడపిల్లలు పదో తరగతి పూర్తయిన వెంటనే అదే పాఠశాలలో ఇంటర్మీడియట్‌లో చేరుతున్నారు. స్వగ్రామంలోనే ఉన్నత విద్య అందుతుండడంతో ఆడపిల్లల తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో కూడా మార్పు వచ్చింది. దీంతో తమ కుమార్తెలను మరో రెండేళ్ల పాటు చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో బాలికల అక్షరాస్యత శాతం పెరిగింది. విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇంజినీరింగ్ చదివిస్తామన్నారు!



మాది పేద కుటుంబం. మా నాన్న మేస్త్రీ పనిచేస్తారు. పదో తరగతి పూర్తయిన తరువాత, మా హైస్కూల్‌లోనే ఇంటర్ కోర్సు అందుబాటులోకి రావడం, అమ్మఒడి కూడా ఇస్తుడడంతో ఇప్పుడు మా తల్లిదండ్రులు ఇంజినీరింగ్ కూడా చదివిస్తామం టున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాకు మా స్కూల్‌లోనే బాలికలకు ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో మేము కూడా మగపిల్లలతో సమానంగా చదువుకోగలుగుతున్నాం. సీఎం జగన్ మామ చేసిన మేలు మరువం.

–సి.పూజ ఎంపీసీ, సీనియర్ ఇంటర్

బాలికలకు ఎంతో ఉపయోగం



హైస్కూలు ప్లస్ విధానం అమలులోకి రావడం బాలికలకు ఎంతో ఉపయోగం. ప్రభుత్వం అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించింది. ప్రస్తుతం 25 మంది విద్యార్థులు చదువుతున్నారు. పరిమిత సంఖ్యలోనే విద్యార్థులు ఉండడంతో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపుతున్నాం. ప్రభుత్వం ఈ విధానం నెలకొల్పి రెండేళ్లు అవుతోంది. భవిష్యత్తులో దీని ఫలాలు మరింత మెరుగ్గా ఉంటాయనడంలో సందేహ లేదు. మంచి ఉత్తీర్ణత సాధించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– పుష్పావతి, జువాలజీ, అధ్యాపకురాలు

అన్ని పాఠ్యాంశాలకు అధ్యాపకులు



నేను బలికకండ్రిగ హైస్కూల్లో పదో తరగది చదువుకున్నాను. ఇంటర్మీడియట్‌లో చేరాలంటే చాలా దూరంగా వెళ్లాల్సివస్తుందని అమ్మనాన్నా అలోచించారు. ప్రభుత్వం బలిజకండ్రిగ హైస్కూల్‌లోనే ఇంటర్మీడియట్ విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో మా తల్లిదండ్రులు నా చదువు కొనసాగించారు. నాకు చాలా సంతోషంగా ఉంది. అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు ఉన్నారు. చాలా చక్కగా విద్యను బోధిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికల కోసం పల్లెలోనే కళాశాల ఏర్పాటు చేయడం మాకు సంతోసంగా ఉంది.

–సుమతి, బైపీసీ, విద్యార్థిని

నిరుపేదలకు వరం



హైస్కూల్లోనే ఇంటర్మీడియట్ కోర్సు అందుబాటులోకి తేవడం నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు వరం. ప్రభుత్వం విద్యలో ఇలాంటి విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంతో బాలికలకు మేలు చేకూరింది. తరగతికి 25 మంది విద్యార్థులే కావడంతో ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టడానికి వీలు కలుగుతోంది. గతేడాది తరగతులు ఆలస్యంగా ప్రారంభం కావడంతో పరీక్షల్లో మార్కులు తగ్గాయి. ఈ సారి అధ్యాపకులంతా ఎంతో కష్టపడి బోధిస్తున్నారు. ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తాం.

–డీ.దొరస్వామి. తెలుగు అధ్యాపకుడు

అధైర్యపడకండి



మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులు అధైర్యపడకుండా ధైర్యంగా పరీక్షలు రాసేందుకు సిద్ధం కావాలని ఎంపీపీ లత అన్నారు. శుక్రవారం ఆర్కే ఎస్సార్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై ఆ పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ పరీక్షలపై భయం వీడి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ డిగ్రీకళాశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు విజయులు, స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని సూచించారు. విద్యార్థులకు విద్యాభ్యాసంలో క్రమశిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. పదోతరగతి విద్యార్థి జీవితానికి ఒక మలుపు లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, డైట్ అధ్యాపకులు చెంగల్ రాజు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

జంతువులకు హాని కలిగించకూడదు



విజేతలతో డీవైఈవో, ఎంఈఓలు

నగరి: జంతువులపై దయ కలిగి ఉండాలని పుత్తూరు డివిజన్ ఉప సంచాలకులు టి.గోవిందయ్య అన్నారు. శుక్రవారం మండల, మున్సిపల్ పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జంతు సంక్షేమం, అవగాహన, జంతు హింస చట్టంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పశుసంవర్ధక, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోవిందయ్య మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రేమతో వ్యవహరించాలని, హాని కలిగించకూడదని తెలిపారు. ఎంఈవో శ్రీదేవి, నమశ్శివాయం, పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ వాసు పాల్గొన్నారు.

సాగునీటికి అడ్డుకట్ట వేశారని ఆందోళన



గంగ కాలువలో దిగి కోవనూరు రైతుల నిరసన

కేవీబీపురం: తమ భూములకు అందాల్సిన సాగునీటికి ఎగువనున్న భూస్వాములు అడ్డుకట్ట వేయడంతో పంటలు ఎండిపోతున్నాయని మండలంలోని కోవనూరు, బ్రాహ్మణపల్లె, గుంటిపేడు, అంజూరు, అంగేరి చెరువ, అప్పనగుంట గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు తెలుగుగంగ కాలువలో దిగి శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గంగ కాలువ ద్వారా వచ్చే నీటితో ఏడు గ్రామాలకు చెందిన సుమారు 800 మంది రైతులు రెండు వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. గంగ కాలువ ద్వారా వచ్చే నీటిని లక్ష్మీపురం వద్ద కొందరు భూస్వాములు అడ్డుకట్ట వేసి వారి భూములకు మాత్రమే మళ్లించుకున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి భూస్వాములు ఏర్పాటు చేసిన కట్టను తొలగించి సాగునీటిని దిగువకు విడుదల చేసేలా గంగ అధికారులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని కోరారు.

మాతాశిశు మరణాలను తగ్గించడమే లక్ష్యం



హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సత్యవేడు: గర్భిణుల్లో రక్తహీనతను నివారించి ప్రసవ సమయంలో మాతాశిశు మరణాల శాతం తగ్గించేలా ఆరోగ్యశాఖ సిబ్బంది పనిచేయాలని జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ ఏ.బేబిరాణి తెలిపారు. శుక్రవారం ఉలవచేనులోని వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్సు టీం తనిఖీ చేసింది. కేంద్రం పరిధిలో రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలను గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో డీపీహెచ్‌ఎన్‌ఓ మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత వల్ల ప్రసవ సమయంలో అనేక సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. ఐరన్ అందించే నువ్వులు, కొబ్బరి, బెల్లం, ఆకుకూరలు, దేవదారు గింజలు, మాంసం, రెడ్‌కిడ్నీబీన్స్, డ్రైఫ్రూట్ గింజలు అధికంగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న పాలు, గుడ్లు, చిక్కీలు, రాగిపిండి, బాలామృతం వంటి పోషకాహారం తప్పని సరిగా తీసుకోవాలన్నారు. గర్భిణులు నెలవారీ వైద్య పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని తెలిపారు.

ఇళ్ల స్థలాలకు పక్కా రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

నాగలాపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నాగలాపురం–1, సురుటుపల్లి సచివాలయంలో ప్రారంభమైనట్లు ఎంపీడీఓ పీఎంకే బాబు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సర్వ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోందని తెలిపారు. పంచాయతి కార్యదర్శి నాగరత్నమ్మ, డిజిటల్ అసిస్టెంట్ హరి, వీఆర్వో స్వర్ణ పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ



స్విమ్స్‌లో కుప్పయ్యశెట్టికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్



చిత్తూరులో గంగాధరానికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన కుప్పయ్యశెట్టి అనారోగ్యంతో తిరుపతి సిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా వలంటీర్ జి. ఇందిర శుక్రవారం అక్కడికి వెళ్లి ఆయనకు పింఛన్ పంపిణీ చేశారు. అలాగే మండల కేంద్రంలోని అక్కన్నగారిపల్లె గ్రామానికి చెందిన గంగాధరం చిత్తూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వలంటరీ జయచంద్ర తన సొంత ఖర్చులతో ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు.

నమో నారసింహ.. నమో భక్తపాల



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

నారాయణవనం: మండలంలోని సింగిరి కోన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం విశేష అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీ నరసింహస్వామి మూలవర్లకు అభిషేకాలను నిర్వహించారు. వెండి కవచాలను, సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, నవగ్రహ, సుదర్శన, ధన్వంతరి, మహా విష్ణు హోమాలను ఆగమోక్తంగా నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. భక్తులకు వస్త్ర బహుమానంతో పాటు తీర్థ ప్రసాదాలను ట్రస్టీ సభ్యులు గిరిబాబు, భాస్కర్ బాబు అందజేశారు. భక్తులకు అన్నదాన సత్రంలో అన్నప్రసాదాలను అందజేశారు. ట్రస్టీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజున ఉభయ నాంచారులతో లక్ష్మీ నరసింహ స్వామికి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి రోజున హోమాలను ఆగమోక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఆలయానికి వచ్చే భక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదాలను నిత్య అన్నదాన సత్రంలో అందచేస్తున్నట్లు తెలిపారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

సత్యవేడు: జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చెన్నేరిలో వ్యాధి నిర్మూలనపై గ్రామస్తులు, విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారి గుణశేఖర్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చర్మంపై ఎరుపు లేదా రాగిరంగు కలిగిన మచ్చలు ఉంటాయని, మచ్చపై స్పర్శ, నొప్పి ఉండదన్నారు. ప్రారంభ దశలో గుర్తించి మందులు తీసుకుంటే వ్యాధి నయమవుతుందని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య



సరస్వతి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు ఉత్తమ విద్య అందుతుందని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ అన్నారు. శుక్రవారం వనదుర్గాపురం ఎంపీయూపీ పాఠశాలల్లో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు కోదండయ్య సమక్షంలో విద్యార్థులకు దాతలు ఇచ్చిన నోటుపుస్తకాలు పంపిణీ చేసి, సరస్వతి విగ్రహం ప్రతిష్టించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు, అమ్మఒడి తదితర పథకాలు అమలు చేసిందన్నారు. పాఠశాలల ఆధునికీకరణకు నాడు–నేడు పథకం అమలు చేసిందని చెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన సరస్వతి విగ్రహానికి ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహరాజు, ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్, శ్యామలమ్మ, సీఆర్పీ రాజేశ్వరి, మునిరాజ్ పాల్గొన్నారు.



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓ

ఆరోగ్య సంజీవని.. జగనన్న సురక్ష





పెనుమూరు: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు, శ్రీరంగరాజపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణయ్య

పెనుమూరు(కార్వేటినగరం): జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట ఆరోగ్య సంజీవనని ఇన్‌చార్జి ఎంపీడీఓ పూర్ణచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చార్వకానిపల్లె సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కంటి వెలుగు ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు చేసి, కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మీనా సయ్యద్, డాక్టర్ వెంకటేశ్వర్‌నాయుడు, ఈఓపీఆర్డీ మహేశ్వర్ రెడ్డి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు భాగ్యలక్ష్మి, డీడీఓ ఉషారాణి, ఏఎన్‌ఎం గిరిజ పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యమే లక్ష్యం

శ్రీరంగరాజపురం: ప్రజారోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. మండలంలోని ఏఎం పురం సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి, ప్రజలు రూ.లక్షలు ఖర్చు చేసుకోకూడదని రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోనే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తుందన్నారు. శిబిరంలో 440 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ బాలసుబ్రమణ్యం, సందీప్‌రాజు, పార్టీ మండల కన్వీనర్ మణి, సర్పంచ్ మల్లికమ్మ, నాయకులు లోకనాథరాజు, జనార్దన్, అమృతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

పుత్తూరు: స్వామి వివేకానందాను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు సూచించారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని పెన్షనర్స్ భవనంలో శ్రీరామమఠం ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్‌లు అందజేశారు. రామకృష్ణ మఠం కార్యదర్శి మునికృష్ణయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కృపావరమ్మ, యుగంధర్‌రాజు, రవిశంకర్, కుప్పయ్య, రామమూర్తిరాజు, డాక్టర్లు కృష్ణకాంత్, పల్లవి, హెడ్‌నర్స్ దిల్షాద్ పాల్గొన్నారు.